క్లుప్తంగా

పిల్లలు విద్యకు దూరం కాకూడదు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: పిల్లలు విద్యకు దూరం కాకూడదని, బడి బయట ఉన్నవారిని గుర్తించి పాఠశాలకు పంపే దిశగా చర్యలు ముమ్మరం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. స్థానిక జిల్లా న్యాయస్థానం ఆవరణలో బాలల హక్కుల పరిరక్షణకు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వివిధ కారణాలతో ప్రాథమిక విద్యకు దూరమవుతున్న పిల్లలను గుర్తించాలన్నారు. పిల్లల హక్కులకు భంగం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, దీనిపై ఎప్పటికప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు నివేదిక అందించాలని అన్నారు. ఈ మేరకు అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు సినీ సంగీత విభావరి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ ఆరో వార్షికోత్సవం సందర్భంగా ఇంద్రధనస్సు –6 పేరుతో రాజమహేంద్రవరంలోని వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో శనివారం సాయంత్రం 5 గంటలకు సినీ సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఈ మేరకు సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆదిమూలం సాయిబాబా, ఎంవీ అయ్యప్ప శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

రేపు కార్తిక వనసమారాధన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులోని తెలుకులవారి పార్కు పక్కనే గల చందన రమేష్ గార్డెన్స్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి అఖిల గాండ్ల, తెలికుల, దేవతిలకుల కార్తిక వనసమారాధన శంఖారావం జరుగుతుంది. ఈ విషయాన్ని కన్వీనర్, అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరవ అనంతం, నరవ గోపాలకృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ముందుగా మున్సిపల్ స్టేడియం నుంచి సంఘీయులు భారీ ర్యాలీగా సభా వేదికకు చేరుకుంటారన్నారు. శంఖారావానికి సంఘ నేతలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు.


రేపు బుర్రిలంకలో అయ్యప్ప పూజ

కడియం: మండలంలోని బుర్రిలంకలో ఆదివారం అయ్యప్పస్వామి విశేష పూజకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. తాడాల వీర వెంకట్రావు గురుస్వామి ఆధ్వర్యంలో ప్రముఖ నర్సరీ రైతు కొత్తపల్లి నాగేశ్వరరావు, నాగమణి దంపతుల కుమారులు అయ్యప్ప దీక్షను పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆరోజు ఉదయం నుంచి రాత్రి వరకూ వివిధ రకాల పూజలు జరుగుతాయి. ఆరాట్టు ఉత్సవాన్ని మొదటిసారిగా ఈ ప్రాంతంలో నిర్వహిస్తున్నట్లు వీర వెంకట్రావు గురుస్వామి తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన ఆధ్యాత్మిక ప్రముఖులు ఈ కార్యక్రమానికి విచ్చేస్తున్నారన్నారు. పూజా కార్యక్రమాలకు విచ్చేసే అయ్యప్ప మాలధారులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నట్లు నిర్వాహకులు కొత్తపల్లి గణేష్, కొత్తపల్లి శివాజీ, కొత్తపల్లి మూర్తి తెలిపారు.

బీజేపీ ఎస్సీమోర్చా భిక్షాటన

రాజమహేంద్రవరం సిటీ: ఏపీ ఎస్సీ కార్పొరేషన్‌లో రద్దయిన 26 రకాల పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎస్సీ మోర్చా భిక్షాటన చేపట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక ప్రకాశం నగర్‌లో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మికి వినతి పత్రం అందజేసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గుడిసె దేవానంద్ సూచనలతో ఈ నిరసన చేపట్టినట్లు ఎస్సీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి పేదూరి యుగంధర్, జిల్లా అధ్యక్షుడు దున్న సుమన్ బాబు తెలిపారు.

ఘనంగా రాకడ పండగ



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కడియం: పొట్టిలంకలోని సెయింట్ దేవదాసు పెనుమేలు ప్రార్థనా మందిరంలో శుక్రవారం రెండవ రాకడ పండగ ఘనంగా జరిగింది. అంతర్జాతీయ బైబిలు మిషన్ సెక్రటరీ కె.ప్రశాంత కుమార్, డి.రత్నరాజు, సంఘ కాపరి సీహెచ్ పాల్ దొరబాబు, అరుణా పాల్, స్వరూప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

ఆర్థిక సాయం

కడియం: ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన పల్లి కుమారి కుటుంబానికి కడియపులంక ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ రూ.పదివేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పంతం గణపతి, స్థానిక నాయకులు బోడపాటి రాజేశ్వరి, పుల్లా రామన్న, కట్టా శివ పాల్గొన్నారు.

కాటన్ బ్యారేజీ రోడ్డుకు మహర్దశ

- రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు
- వచ్చే నెల ప్రారంభం



ధవళేశ్వరంలో కాటన్ బ్యారేజీ రోడ్డు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ రోడ్డుకు మహర్దశ పట్టనుంది. బ్యారేజ్ రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపడంతో వచ్చే నెల రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. బ్యారేజీ రోడ్డు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ.2 కోట్లను కేటాయించారు. దీనిపై వాహన చోదకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బ్యారేజీ రోడ్డులో మొత్తం 6.8 కిలోమీటర్ల మేర పనులు జరగనున్నాయి. తాత్కాలిక మరమ్మతుల ద్వారా సమస్య మొదటికి వస్తుండటంతో రోడ్డు పూర్తి స్థాయి అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది.

పూర్తి స్థాయిలో సమస్య పరిష్కారం

బ్యారేజీ రోడ్డు సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మరమ్మతు పనులతో త్వరగా రోడ్డు పాడవుతుండటంతో పూర్తి స్థాయి రోడ్డు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. బ్యారేజీ రోడ్డుకు గతంలో మరమ్మతుల సమయంలో సీసీ రోడ్డుపై తారు రోడ్డు వేశారు. దీంతో తరచూ మరమ్మతులకు గురవుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని పూర్తి స్థాయి అభివృద్ధికి ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించిందని ఇప్పటికే కలెక్టర్ మాధవీలత వెల్లడించారు. ధవళేశ్వరం, మద్దూరు, ర్యాలీ ఆర్మ్‌లకు సంబంధించి రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. సీసీ రోడ్డుపై ఉన్న తారురోడ్డును తొలగించేందుకు ప్రత్యేక యంత్రాన్ని వినియోగించనున్నారు.

నెల రోజులు రాకపోకల నిలిపివేత

కాటన్ బ్యారేజీ రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తుండటంతో నెల రోజుల పాటు రాకపోకలను నిలిపివేయనున్నారు. మరమ్మతుల సమయంలో రాజమహేంద్రవరం రోడ్ కం రైల్ బ్రిడ్జి, గామన్ బ్రిడ్జి మీదుగా వాహనాలను మళ్లించనున్నారు. డిసెంబర్‌లో పనులు ప్రారంభించి, సంక్రాంతికి ముందు రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతో అధికారులు కృషి చేస్తున్నారు.

పేదరికమే అర్హతగా పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి నిర్మల

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన రామరాజ్యాన్ని తలపిస్తోందని రాష్ట్ర ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల అన్నారు. ఆయన పాలనను టీడీపీ, జనసేన నాయకులు విమర్శించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా, పేదరికమే అర్హతగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌ను విమర్శించడం తగదని హితవు పలికారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల గడప వద్దకే అందిస్తున్నారన్నారు. ఆ రెండు పార్టీలకు రాబోయే ఎన్నికలలో ప్రజలే తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. రూరల్ నియోజకవర్గంలో ప్రజలకు ఏకష్టం వచ్చినా తాను ఉన్నానంటూ చందన నాగేశ్వర్ భరోసా ఇస్తున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ నాగులపల్లి ఆశ, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, కడియం మండల మహిళా విభాగం అధ్యక్షురాలు ఊటుకూరి శైలజ, కన్నమాంబ దేవస్థానం డైరెక్టర్ పడమటి నాగమణి, పార్టీ నాయకులు పట్టపగలు వెంకటలక్ష్మి, పెన్నాడ లక్ష్మి, చప్పిడి జ్యోతి, పసుపులేటి దేవి పాల్గొన్నారు.

వైద్యశిబిరం

రాజమహేంద్రవరం రూరల్: సంఘమిత్ర లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొంతమూరులోని సంతోష్ నగర్‌లో పులర్టన్ ఇండియా సహకారంతో శుక్రవారం షుగర్ వైద్యశిబిరం నిర్వహించారు. సెక్రటరీ యార్లగడ్డ చిట్టిబాబు మాట్లాడుతూ శిబిరంలో సుమారు 50 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశామన్నారు. కార్యక్రమంలో హరిత దళం స్వచ్ఛంద సంస్థ సిబ్బంది జీవీ దుర్గాదేవి, బి.నరేష్ రాజా, ఎం.దివ్య, గ్రేస్ ట్రస్ట్ నిర్వాహకులు రోషన్ వర్జిల్ వాసా పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ శ్యామ్‌రాజు నాయక్

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.చవాన్ శ్యామ్‌రాజు నాయక్ అన్నారు. కాతేరులోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు శుక్రవారం ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. శ్యామ్‌రాజు నాయక్ మాట్లాడుతూ దేశానికి వ్యవసాయం వెన్నెముక లాంటిదని, కోవిడ్ సమయంలో అన్ని రంగాలు మూతపడినా వ్యవసాయంలో రైతులు కష్టపడ్డారన్నారు. దేశానికి ఆహారం అందించడంలో ముఖ్య పాత్ర పోషించారన్నారు. దేశ భవిష్యత్తును మార్చే శక్తి విద్యార్థులకు ఉందన్నారు. అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఇన్‌చార్జి డాక్టర్ దయాకర్, డాక్టర్ ఉషా రాణి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

10న విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ: దామెర్ల రామారావుని స్మరించుకోవడం చిత్రకళకు మనమిచ్చే గౌరవమని కలెక్టర్ మాధవీలత అన్నారు. దామెర్ల రామారావు 125వ జయంతి వేడుకల్లో భాగంగా గోదావరి బాలోత్సవం, మాదేటి రాజాజీ ఆర్ట్ అకాడమీ, గోదావరి జిల్లాల కార్టూనిస్టుల సంఘం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 10న రాజమహేంద్రవరం నగర స్థాయిలో చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మాధవీలత ఆవిష్కరించారు. గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి మాట్లాడుతూ చిత్రలేఖనం పోటీల్లో రెండు నుంచి పదో తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఎటువంటి ప్రవేశ రుసుము లేదని, పోటీల్లో పాల్గొనేవారు 93471 99131 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బాలోత్సవం కార్యక్రమం నిర్వాహకులు పి.మురళీకృష్ణ, రవికాంత్, ప్రముఖ కార్టూనిస్ట్ శేఖర్, డాక్టర్ చైతన్య శేఖర్, జార్జి ప్రసాద్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల మాయంపై చర్యలు చేపట్టాలి

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేఆర్ మహిళా కళాశాలలో ఎంబీఏ విద్యార్థి రమాహర్షిత సర్టిఫికెట్లు మాయం కావడంపై వెంటనే చర్యలు చేపట్టాలని ఏబీవీపీ నగర కార్యదర్శి రాఘవ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హితకారిణి సమాజానికి పాలకమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్ మునికుమారి, డైరెక్టర్లు కళాశాల విద్యార్థిని ఒరిజినల్ సర్టిఫికెట్లపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి



తొర్రేడు జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణనాయక్

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు, సంస్థాగత లక్ష్యాలను సాధించేందుకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు క్రియాశీలకంగా కృషి చేయాలని హౌసింగ్ మండల ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణ నాయక్ ఆదేశించారు. ఆయన శుక్రవారం తొర్రేడులోని జగనన్న లేఅవుట్‌లో గృహనిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. లబ్ధిదారులను గృహ నిర్మాణాలు పూర్తిచేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా గృహ నిర్మాణ లబ్ధిదారులకు అందుతున్న ఆర్థిక సాయంపై లబ్ధిదారులతో మాట్లాడారు. గృహనిర్మాణ సంస్థ అనుసరిస్తున్న విధానాలను కూలంకుషంగా వివరించారు. లోకాస్ట్ టెక్నాలజీలో భాగంగా కాలమ్స్‌లేని గోడలపై శ్లాబ్ వేయు విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐదుగురు లబ్ధిదారులు తమ గృహనిర్మాణాలను ప్రారంభిస్తామని ముందుకు వచ్చారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం గృహనిర్మాణ సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీవీఎస్ఎన్ మూర్తి, పంచాయతీ కార్యదర్శి చెరుకూరి రాణి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సత్యవతి పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడాసామగ్రి వితరణ



క్రీడాసామగ్రి అందజేస్తున్న మేనేజర్ వివేక్ వర్మ

రాజమహేంద్రవరం సిటీ: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు క్రీడల్లో ప్రోత్సాహం ఇవ్వాలని కెనరా బ్యాంక్ దేవీచౌక్ శాఖ మేనేజర్ వివేక్ వర్మ అన్నారు. ఆ బ్యాంక్ సీఎస్ఆర్ ఆక్టివిటీలో భాగంగా శుక్రవారం స్థానిక జాంపేట లూథరన్ హైస్కూల్ విద్యార్థులకు సుమారు రూ.25 వేల విలువైన క్రీడా సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మేరీ పెరల్స్, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ చైర్మన్ కాటం రజనీకాంత్, స్కూల్ సెక్రటరీ మార్టిన్ సుధాకర్, ఆముదాల నాని, జెమిమా మేడమ్, ఆముదాల సన్నీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు



కొంతమూరులో పుట్టకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు

రాజమహేంద్రవరం రూరల్/సీటీఆర్ఐ: నాగుల చవితి పర్వదినాన్ని సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ప్రజలు శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. సమీపంలోని పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రునికి పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు కొంతమూరు సమీపంలో నాగేంద్రుని పుట్టకు పూజలు చేశారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల, రోడ్డు భవనాల అతిథి గృహం, జడ్జి బంగ్లా, సీటీఆర్ఐ, భాస్కర్ నగర్, శేషయ్యమెట్ట, సుబ్రహ్మణ్య నగర్, సింహాచల నగర్ తదితర ప్రాంతాలలోని పుట్టలకు మహిళలు పూజలు నిర్వహించారు. కోరుకొండ రోడ్డులోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలోని నాగేంద్రుని విగ్రహాలకు భక్తులు క్షీరాభిషేకం చేశారు. ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉపాలయంలో అభిషేకాలు నిర్వహించారు. శృంగేరీ శారదా శంకరమఠంలో సుబ్రహ్మణ్య స్వామికి కాలసర్పదోష నివారణ పూజలు జరిపారు. నారాయణపురం నాగమ్మ తల్లి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. హుకుంపేటలోని పాములగుడిలో అభిషేకాలు జరిగాయి.



అక్షరపీఠంలో నాగేంద్రుని ప్రతిమలు



హుకుంపేట పాములగుడి వద్ద పుట్టకు మహిళల పూజలు

26న గవర సంఘీయుల ఆత్మీయ కలయిక

మధురపూడి: పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరంలో ఈ నెల 26 వ తేదీన నిర్వహించనున్న గవర సంఘీయుల ఆత్మీయ కలయికను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దాల రమణ విజ్ఞప్తి చేశారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం సెంటర్‌లోని గౌరీదేవి ఆలయ కల్యాణ మండపంలో శుక్రవారం గవర సామాజిక వర్గం సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో బీసీల కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కాగా.. ఆత్మీయ కలయికకు సంఘీయులందరినీ నిర్వాహకులు ఆహ్వానించారు. సమావేశంలో సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, ఎంపీటీసీ తనకాల నూకరాజు, సూరిశెట్టి అప్పలస్వామి పాల్గొన్నారు.

లాభాల బాటలో సహకార బ్యాంకులు

- ఆప్కాబ్ ఎండీ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి
- తొర్రేడులో సహకార వారోత్సవాలు



విశ్రాంత ఉద్యోగి సుభాష్‌ను సత్కరిస్తున్న ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలోని జిల్లా సహకార కేంద్రబ్యాంకుల్లో సగానికి పైగా లాభాల బాటలో పయనిస్తున్నాయని ఆప్కాబ్ ఎండీ డాక్టర్ ఐఐఆర్ శ్రీనాథ్ రెడ్డి అన్నారు. తొర్రేడులోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)లో 70వ సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్ రెడ్డి సహకార సప్తవర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు ఇఫ్కో వారి సహకారంతో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా పశువైద్యాధికారి సత్య గోవింద్ ఆధ్వర్యంలో పశువైద్యాధికారి బి.జ్యోత్స్న పశువులకు వైద్య సేవలు అందించారు. పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ డీసీసీబీలు సహకార సంఘాలకు వాటాధనంపై 6 శాతం వడ్డీని గానీ, డివిడెంట్ గానీ ఇవ్వాల్సి ఉందన్నారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ సంఘ సేవలను సభ్యులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆప్కాబ్ సీజీఎం రత్నం మాట్లాడుతూ జిల్లా సంఘ సభ్యులకు అత్యధిక సేవలు అందిస్తున్న తొర్రేడు సొసైటీని అభినందించారు. ఆప్కాబ్ జీఎం మణి మాట్లాడుతూ త్వరలో సహకార సంఘాలన్నింటినీ కంప్యూటరీకరణ చేస్తామన్నారు. డీసీసీబీ సీఈవో ఆర్‌వీ నరసింహారావు, రామదాసు సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వెదురుపాక శ్రీనివాస్ ప్రసంగించారు. సంఘ చైర్మన్ చిట్టూరి వెంకటరావు మాట్లాడుతూ సంఘ సభ్యులకు సంఘం ద్వారానే రుణాలు ఇవ్వాలని కోరారు. ఇఫ్కో వారి సహకారంతో రైతులకు స్ప్రేయర్లు పంపిణీ చేశారు. అనంతరం సంఘం మాజీ ఉద్యోగి గారపాటి సుభాష్‌ను, సంఘ సీనియర్ సభ్యులను సత్కరించారు.

సంక్షేమ పథకాలతో అభ్యున్నతి

- వైఎస్సార్ సీపీ సిటీ కోర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- 42వ డివిజన్‌లో గడప గడపకూ..



ప్రజలతో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల ఆర్థిక అభ్యున్నతికి దోహదపడుతున్నాయని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 42వ డివిజన్‌లో ఇన్‌చార్జి నామన వాసు ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం వారికి అందజేసిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి, పరిష్కానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు టీకే విశ్వేశ్వరరెడ్డి, గౌతమీ జీవ కారుణ్య సంఘం చైర్మన్ బర్రే కొండబాబు, వజ్రనాథ్, జాలా నటరాజ్ పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థిని ప్రకటించే ధైర్యం ఉందా?



సమావేశంలో మాట్లాడుతున్న యాదల సతీష్‌చంద్ర స్టాలిన్

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి ఎవరో ప్రకటించే ధైర్యం గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కందుల దుర్గేష్‌కు ఉందా అని కడియం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే టీడీపీ, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశాల్లో ముష్టియుద్ధాలు జరుగుతున్నాయన్నారు. కొన్నిచోట్ల వెన్నుపోట్లు పొడుచుకుంటూ.. పైకి బాయ్‌బాయ్ అంటూ నటిస్తున్నారన్నారు. ఇటీవల ఆ పార్టీల నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు సీఎం జగన్‌పై విమర్శలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులందరూ ఒకే కండువా వేసుకున్నామని, ఇప్పుడు టీడీపీ, జనసేన నాయకులు రెండు కండువాలతో వస్తున్నారన్నారు. తరువాత నాలుగు కండువాలతో వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు. నియోజకవర్గంలో చందన నాగేశ్వర్ నాయకత్వంలో సుమారు రూ. 20 కోట్ల మేర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ప్రతి వంద కుటుంబాల్లో 92 కుటుంబాలకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందన్నారు. రూరల్ మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంపై తెలుగుదేశం, జనసేన పార్టీల తప్పుడు ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారన్నారని, రాబోయే ఎన్నికలలో తమ ఓటుతో వారికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో కడియం జేసీఎస్ ఇన్‌చార్జి తాడాల చక్రవర్తి, నగరపాలకసంస్థ డివిజన్ల జేసీఎస్ ఇన్‌చార్జి కొప్పిసీడి ప్రసాద్‌బాబు(రాజమౌళి), పార్టీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు, జిల్లా దివ్యాంగుల సెల్, వైఎస్సార్‌టీయు జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, ముద్దాల అను పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విద్యార్థుల ఉన్నతి



అతిథులను సత్కరిస్తున్న రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్యార్థుల ఉన్నతికి గ్రంథాలయాలు ఎంతో తోడ్పడుతాయని వక్తలు అన్నారు. స్థానిక ఇన్నీసుపేటశాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏపీ రెసిడెన్షియల్ కాలేజ్ విశ్రాంత ప్రిన్సిపాల్ చాగంటి నరసింహారావు, హిందీ పండిట్ రేపాల నవీన పర్యవేక్షణలో శుక్రవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ముందుగా జరిగిన సభలో నగరపాలకసంస్థ స్కూల్స్ విశ్రాంత సూపర్ వైజర్ రాజవరపు వెంకట సత్యనారాయణ, విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ఎస్ ప్రసాద్, పవర్ ఎయిడెడ్ స్కూల్ టీచర్ కె.రాజు, విశ్రాంత ఏపీపీఎం ఇంజినీర్ పిచ్చుక రాంబాబు, ప్రభుత్వ స్కూలు ప్రధానోపాధ్యాయుడు ముంగండ సూర్యనారాయణ మాట్లాడారు. పుస్తక పఠనం ప్రాముఖ్యత, గ్రంథాలయాల ఆవశ్యకత, డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పించారు.

- ఆల్కాట్‌తోట శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారుల స్మరణ కార్యక్రమం, విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విశ్రాంత రైల్వే ఉద్యోగి కె.రాజేంద్ర ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళులర్పించారు. చిత్రలేఖన పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఆల్కాట్‌తోట మున్సిపల్ ఎలిమెంటరీస్కూల్ ఉపాధ్యాయురాలు బి.శాంతి, హర్షవర్ధన ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఉపాధ్యాయురాలు కె.శ్రీదేవి వ్యవహరించారని గ్రంథాలయాధికారి కొత్తపల్లి రమ్యశ్రీ తెలిపారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

సీతానగరం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపీయూటీఎఫ్) సీతానగరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జీఎల్ సత్యనారాయణ, ఆర్.పాపారావు ఎన్నికయ్యారు. కాటవరంలోని సంజీవపురం పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యవర్గం ఎన్నికకు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. గౌరవ అధ్యక్షుడిగా మన్యం పోశయ్య, సహాధ్యక్షుడిగా కె.నాగేశ్వరరావు, సహాధ్యక్షురాలిగా ఎస్.విజయలక్ష్మి, కోశాధికారిగా పి.సూరిబాబు, ఆడిటర్‌గా ఎస్.రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోరుకొండలో ఆదివారం జరిగే జిల్లా కౌన్సిల్ సమావేశాలకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజవంతం చేయాలని నూతన కార్యవర్గం పిలుపునిచ్చింది. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఈ.శ్రావణి, ఆర్పీ దేవవాణి పాల్గొన్నారు.

ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొండలరావు

సీతానగరం: వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీతానగరానికి చెందిన మద్దాల కొండలరావు నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే , పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని మూడు మండలాలకూ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులను ఇప్పటికే నియమించామన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు.

సినిమాలు



శ్యామల	:	జిగర్‌తండ
సూర్యమినీ	:	స్పార్క్‌లైఫ్
సూర్యప్యాలెస్	:	టైగర్–3
స్వామి	:	మంగళవారం
శివజ్యోతి	:	మాఊరి పొలిమేర–2
అనుశ్రీ	:	భగవంత్‌కేసరి
రాజా	:	మంగళవారం
అశోక	:	సప్తసాగారాలు దాటి
ఊర్వశి	:	క్రీడాకోలా, మైనేమ్‌ఈజ్‌శృతి
రంభ	:	జపాన్
మేనక	:	ఏచోట నువ్వున్నా, అన్వేషి
అప్సర	:	ద మార్వెల్స్, ఈఊరిపొలిమేర–2
నామవరం		
వీఎస్ మహల్	:	మంగళవారం
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	మంగళవారం
కడియం		
వెంకటసూర్య	:	మంగళవారం